క్లుప్తంగా

బ్రహ్మోత్సవాల వాల్‌పోస్టర్లు ఆవిష్కరణ



వాల్ పోస్టర్లు ఆవిష్కరిస్తున్న గ్రామ పెద్దలు

ఏర్పేడు: మండలంలోని పాతవీరాపురంలో ఆదివారం ద్రౌపదీ సమేత ధర్మరాజుల స్వామి వార్షిక బ్రహ్మోత్సవాల వాల్‌పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ నెల 26వ తేదీ నుంచి జూన్ 5వ తేదీ వరకు బ్రహ్మోత్సవాలు జరుగనున్నట్లు సర్పంచ్ మంజుల, ఆలయ చైర్మన్ మాధవరెడ్డి తెలిపారు. భక్తుల సౌకర్యార్థం ఆలయంలో అన్ని వసతులు కల్పించనున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు గురవారెడ్డి, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు మునిరంగారెడ్డి, మాజీ ఎంపీటీసీ కోదండరామిరెడ్డి పాల్గొన్నారు.

లారీ బోల్తా.. డ్రైవర్‌కు గాయాలు



నెల్లటూరు మార్గంలో బోల్తా పడిన లారీ

వరదయ్యపాళెం: నెల్లటూరు మార్గంలోని మలుపు వద్ద ఆదివారం లారీ బోల్తా పడింది. శ్రీకాళహస్తి నుంచి తమిళనాడు గుమ్మడిపూండికి ఐరన్ ఓర్ లోడ్‌తో వెళ్తున్న లారీ దారితప్పి కడూరు కూడలి నుంచి నెల్లటూరు మార్గంలో వెళ్తుండగా తాగేలి మలుపు వద్ద అదుపు తప్పి బోల్తా పడింది. ఈ ఘటనలో డ్రైవర్ రత్నంకు గాయాలయ్యాయి. అతన్ని చికిత్స నిమిత్తం శ్రీకాళహస్తికి తరలించారు.

భక్తిశ్రద్ధలతో అగ్నిగుండ ప్రవేశం



విశేష అలంకరణలో ముత్తుమారియమ్మ

పిచ్చాటూరు: నాగలాపురం ముత్తుమారి అమ్మ ఆలయంలో ఆదివారం రాత్రి కంకణం ధరించిన భక్తులు భక్తిశ్రద్ధలతో అగ్నిగుండం ప్రవేశం చేశారు. అమ్మవారి వార్షిక తిరుణాళ్లలో భాగంగా నైవేద్యం సమర్పించారు. సాయంత్రం అమ్మవారిని ఉగ్రరూపిణిగా అలంకరణ చేసి గ్రామవీధుల్లో ఊరేగించారు. అనంతరం అమ్మవారి ఎదుట భక్తులు అగ్నిగుండం ప్రవేశం చేసి మొక్కులు తీర్చుకున్నారు.

వేడుకగా వీరబ్రహ్మేంద్రస్వామి కల్యాణోత్సవం



వీరబ్రహ్మేంద్రస్వామి కల్యాణోత్సవం చేస్తున్న అర్చకులు



భక్తులకు అన్నదానం

తిరుపతి కల్చరల్: మహతిలో ఆదివారం విశ్వబ్రాహ్మణ కార్పొరేషన్ డైరెక్టర్ ఎం.భారతి ఆధ్వర్యంలో టీటీడీ సహకారంతో నిర్వహించిన శ్రీపోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి, గోవిందమాంబ కల్యాణోత్సవం కనుల పండువగా సాగింది. ఇందులో భాగంగా ఉదయం విఘ్నేశ్వరపూజ, హోమం, విశ్వకర్మ మహాయాగం, గణపతి హోమం, సుదర్శన హోమం, మహాలక్ష్మీ హోమం, మృత్యుంజయ హోమం, ఆయుష్షు, సౌభాగ్య హోమాలు శాస్త్రోక్తంగా చేపట్టారు. అనంతరం వీరబ్రహ్మేంద్రస్వామి, శ్రీగోవిందమాంబ ఉత్సవమూర్తులకు ప్రత్యేక పూజలు చేశారు. మధ్యాహ్నం 2.05 నుంచి 4 గంటల వరకు కల్యాణోత్సవం వేడుకగా చేపట్టారు. కర్ణాటక ఆశ్రమం శివసిద్ధేనందస్వామి, కాశీ కైలాస మఠం జ్యోతిరాధానంద స్వామి అనుగ్రహణ భాషణం చేశారు. ఎమ్మెల్యే భూమన కరుణాకరరెడ్డి హాజరై పూజలు నిర్వహించారు. సుధా బ్రహ్మ స్టీల్స్ అధినేత వీరబ్రహ్మం భక్తులకు అన్నదానం చేశారు. కార్యక్రమంలో వీరబ్రహ్మేంద్రస్వామి వారి వంశీయులైన 8వ తరం మునిమనవడు నొస్సం వీరభట్లయ్య స్వామి, విశ్వబ్రాహ్మణ సంఘం ప్రతినిధులు గిరిబాబు ఆచారి, మార్గాచార్యులు ఉమాపతి ఆచారి, కార్తీక్ ఆచారి, శివాచారి, మురళీకృష్ణ ఆచారి తదితరులు పాల్గొన్నారు.

బెంగలేని వంగసాగు

- లాభాలు ఆర్జిస్తున్న అన్నదాతలు
- ఎకరాకు రూ.లక్ష వరకు ఆదాయం
- సాగుకు ఆసక్తి



మార్కెట్‌కు తరలించేందుకు వంకాయలను సిద్ధం చేస్తున్న రైతులు



బీఎన్ కండ్రిగలో వంగ తోట



వంకాయల బస్తాలు

బుచ్చినాయుడుకండ్రిగ: వంగకు మార్కెట్‌లో మంచి ధరలు ఉండడంతో రైతులు బెంగ లేకుండా పంటను సాగు చేస్తున్నారు. మండలంలోని బుచ్చినాయుడుకండ్రిగ, కారణి, వెస్టువరత్తూరు, గాజులపెళ్లూరు, జీఎన్‌కండ్రిగ, ఆర్‌అనంతాపురం, పూసలపల్లి, నెలవాయి, కల్లివెట్టు, ఆలత్తూరు, పార్లపల్లి, పల్లమాల గ్రామాల్లో రైతులు వంగను ఎక్కువగా సాగు చేస్తున్నారు. ఈ గ్రామాల్లో 36 మంది రైతులు 243 ఎకరాల్లో వంగ పంటను సాగుచేస్తూ మంచి లాభాలు పొందుతున్నారు. వంగచెట్ల పెంపకం కోసం విత్తనాలను చెన్నైలోని కోయంబేడు ప్రాంతంలోని షాపుల నుంచి తీసుస్తారు. విత్తనాలను ఒక రోజు నీటిలో నానబెట్టి పొలంలో చల్లుతారు. నెలరోజుల తర్వాత నారును పొలంలో నాటుతారు. ఆరుతడి పంట కావడంతో మెట్ట భూముల్లోనే వంగ పంటను ఎక్కువగా సాగు చేస్తారు. వంగనారుని ఎకరాకు 1,500 చెట్లను నాటిన తర్వాత నెలరోజులకు కాపుకు వస్తాయి. ఐదు నెలల పాటు వంగచెట్లు కాయలను కాస్తాయి. వంగనారు నాటినప్పటి నుంచి ఎకరాకు సంవత్సరానికి రూ. 20 వేలు ఖర్చు అవుతుంది. ఎకరాకు రూ.లక్ష వస్తోంది. అన్ని ఖర్చులు పోను రూ. 80 వేలు మిగులుతుంది. మంచి ధర వస్తే ఆదాయం ఇంకా పెరుగుతుంది. వాణిజ్య పంట కావడంతో వంకాయలకు మార్కెట్‌లో మంచి డిమాండ్ ఉంది. రైతులు వంకాయలను చెన్నైలోని కోయంబేడు కూరగాయల మార్కెట్‌కు తీసుకెళ్లి అమ్ముతారు. చెన్నైలోని ప్రముఖ హోటల్స్‌లోని వంట తయారీకి సరఫరా చేస్తారు. హోటల్స్‌లో వంకాయలను ఎక్కువగా సాంబారుకు వాడతారని, నాణ్యతను బట్టి ధరను చెల్లిస్తారని రైతులు అంటున్నారు. ప్రభుత్వం నుంచి ఎలాంటి ప్రోత్సాహాలు అందడం లేదని రైతులు వాపోతున్నారు. ఆరుతడి పంట కావడంతో విద్యుత్ వినియోగం తగ్గుతుంది. కూలీల ఇబ్బంది ఉండదని రైతులు అంటున్నారు. వంగసాగు వల్ల అధిక లాభాలు వస్తుండడంతో రైతులు మక్కువ చూపుతున్నారు.

సబ్సిడీపై ఎరువులు ఇవ్వాలి

వంగపంటకు ప్రభుత్వం సబ్సిడీపై ఎరువులు, పురుగు మందులను పంపిణీ చేయాలి. ప్రభుత్వం మార్కెట్‌లో కొనుగోలు చేయాలి.

–వెంకటకృష్ణయ్య, రైతు, బీఎన్ కండ్రిగ

కొత్తరకం విత్తనాలను ఉచితంగా ఇవ్వాలి

కొత్తరకం వంగ పంట సాగు కోసం విత్తనాలను ప్రభుత్వం ఉచితంగా పంపిణీ చేయాలి. పాతవిత్తనాల నారును నాటడం వల్ల దిగుబడి తగ్గుతుంది. కొత్తనారును నాటితే పంట దిగుబడి పెరిగి ఆదాయం వస్తుంది.

–రమేష్, రైతు

వంగలో మంచి లాభాలు,

వంగపంటను సాగు చేయడం వల్ల ఎకరాకు రూ. లక్ష ఆదాయం వస్తోంది. వాణిజ్య పంట కావడంతో మార్కెట్‌లో మంచి డిమాండ్ ఉంది. చెన్నైలోని కోయంబేడు మార్కెట్‌లో మంచి ధర వస్తోంది.

–వెంకటయ్య రైతు

విద్యార్థికి ల్యాప్‌టాప్ వితరణ



ల్యాప్‌టాప్ అందిస్తున్న ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి

తొట్టంబేడు(శ్రీకాళహస్తి): తొట్టంబేడు మండలం చియ్యవరం గ్రామానికి చెందిన నిరుపేద విద్యార్థి కార్తీక్ గూడూరు ఆదిశంకర కాలేజీలో డిప్లమా ద్వితీయ సంవత్సరం చదువుతున్నాడు. తనకి లాప్‌టాప్ అవసరం కావడం.. ఆర్థిక స్తోమత అంతంత మాత్రంగానే ఉండడంతో ఆదివారం శ్రీకాళహస్తిలోని వైఎస్సార్‌సీపీ పార్టీ కార్యాలయంలో ఎమ్మెల్యేని కలిసి సమస్యను తెలియజేశారు. వెంటనే స్పందించిన ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి కొత్త డెల్ కంపెనీకి చెందిన ల్యాప్‌టాప్ కొనిచ్చారు. బాగా చదువుకుని తల్లిదండ్రులను బాగా చూసుకోవాలని తెలిపారు. నిరుపేదలకు సాయం చేయడంలో ఎమ్మెల్యేకు సాటి లేరని పట్టణ, గ్రామీణ ప్రాంతాలకు చెందిన వారు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. తొట్టంబేడు పార్టీ అధ్యక్షుడు ఉన్నం వాసు నాయుడు, కొన్నలి రమేష్ పాల్గొన్నారు.

సోమనాథేశ్వరాలయంలో విశేష పూజలు



సోమనాథేశ్వరున్ని దర్శించుకుంటున్న భక్తులు

పిచ్చాటూరు: మండలంలోని సిద్ధిరాజుకండ్రిగ సోమనాథేశ్వరాలయంలో ఆదివారం విశేష పూజలు నిర్వహించారు. మండల పూజల్లో భాగంగా ఉదయం 10 గంటలకు పార్వతీ సమేత సోమనాథేశ్వరునికి ప్రత్యేక అభిషేక పూజలు చేశారు. అనంతరం ఉప ఆలయాల్లో కొలువుదీరిన లక్ష్మీ గణపతి, ఆంజనేయ స్వామి, వల్లీదేవసేన సమేత సుబ్రహ్మణ్య స్వామి, లక్ష్మణ సమేత సీతారాముల వారికి ప్రత్యేక పూజలు చేసి నైవేద్యం సమర్పించారు. అనంతరం స్వామి, అమ్మవార్లకు విశేష అలంకరణ చేసి భక్తులకు దర్శనభాగ్యం కల్పించారు. ఆలయానికి వచ్చిన భక్తులకు అర్చకులు తీర్థ ప్రసాదాలు అందించి ఆశీర్వచనాలు పలికారు. మధ్యాహ్నం ఆలయ ప్రాంగణంలో అన్నదానం చేశారు. ఏర్పాట్లను ఆలయ ధర్మకర్త జ్యోతిరాజు పర్యవేక్షించారు.

హెల్పింగ్ హ్యాండ్స్ సేవలు అభినందనీయం



మునీర్‌బాషాని అభినందిస్తున్న నాయకులు

తొట్టంబేడు(శ్రీకాళహస్తి): శ్రీకాళహస్తిలోని హెల్పింగ్ హ్యాండ్స్ సంస్థ ప్రత్యేక ప్రతిభావంతులకు చేస్తున్న సేవలు అభినందనీయమని బీజేపీ రాష్ట్ర అధికార మీడియా ప్రతినిధి కోలా ఆనంద్ అన్నారు. ఆదివారం దివ్యాంగులకు నిత్యావసర సరుకులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సేవా గుణం అనేది దేవుడు ఇచ్చిన వరం అన్నారు. మునీర్ బాషా తనకున్న సంపాదనలోనే పేదలకు సాయం అందిస్తూ సేవ చేయడం సంతోషంగా ఉందన్నారు. కార్యక్రమంలో సంస్థ సభ్యులు గరికపాటి రమేష్ బాబు, ఢిల్లీ కుమార్, ఉంగరాల మునెయ్య, గాంధీ తదితరులు పాల్గొన్నారు.

ఆదర్శప్రాయుడు శాంతారాం



శాంతారాం జె.పవార్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న నాయకులు

తొట్టంబేడు(శ్రీకాళహస్తి): శ్రీకాళహస్తి ఆలయ, మున్సిపల్ చైర్మన్‌గా నీతినిజాయితీతో పనిచేసి ఆ పదవులకు వన్నె తెచ్చిన ప్రజా నాయకుడు శాంతారాం రామ్ జె.పవార్ అని దేవస్థాం చైర్మన్ అంజూరు తారక శ్రీనివాసులు అన్నారు. ఆదివారం శాంతారాం రామ్ జె.పవార్ నాల్గో వర్ధంతి సందర్భంగా సరస్వతి శిశు మందిర్‌లో రైతు సేవా సమితి నాయకుడు మోహన్ రావు ఆధ్వర్యంలో ఆయన చిత్రపటానికి నివాళులర్పించారు. అవినీతి రహిత పాలనను అందించిన ఆయన్ను ఈ తరం నాయకులు ఆదర్శంగా తీసుకుని సమాజ సేవకు కృషి చేయాలని అన్నారు. కార్యక్రమంలో పీవీఆర్ గ్రూప్ మేనేజింగ్ డైరెక్టర్ ప్రతాప్ రావు వి.పవార్, ముకుంద రావు జె.పవార్, జనార్దన్ రావు జె పవార్, రాజారాం వి.పవార్, పి. మహేశ్వర రావు, జూలుగంటి గోపి, రమణమూర్తి, లక్ష్మయ్య, మహబూబ్ బాషా తదితరులు పాల్గొన్నారు.

గంగమ్మకు పూజలు



అలంకరణలో గంగమ్మ

బుచ్చినాయుడుకండ్రిగ: మండలంలోని నీర్పాకోట ఎస్సీ కాలనీ గంగమ్మ ఆలయంలో ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. గంగమ్మ విగ్రహానికి అభిషేకాలు చేసి అలంకరించారు. గ్రామస్తులు అమ్మవారికి పొంగళ్లు పెట్టి మొక్కులు తీర్చుకున్నారు.

ముక్కంటి సేవలో ప్రముఖులు



ఆలయం వెలుపల కిల్లి కృపారాణి కుటుంబ సభ్యులు

తొట్టంబేడు(శ్రీకాళహస్తి): శ్రీకాళహస్తీశ్వర స్వామిని ఆదివారం పలువురు ప్రముఖులు దర్శించుకున్నారు. ఏపీ హైకోర్టు న్యాయమూర్తి సీహెచ్.మానవేంద్రనాథ్ రాయ్ కుటుంబ సమేతంగా విచ్చేసి రాహుకేతు పూజలు చేశారు. అలాగే కేంద్ర మాజీ మంత్రి కిల్లి కృపారాణి కుటుంబ సమేతంగా ఆలయానికి వచ్చారు. వారికి ఆలయ ఏఈఓ సతీష్ మాలిక్ స్వాగతం పలికారు. అనంతరం వారు స్వామి, అమ్మవార్లను దర్శించుకున్నారు. గురుదక్షిణామూర్తి సన్నిధి వద్ద స్వామి,అమ్మవారి చిత్రపటంతో పాటు తీర్థప్రసాదాలను అందజేశారు.

పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత



మొక్కలు నాటే కార్యక్రమంలో విద్యార్థులు

తొట్టంబేడు(శ్రీకాళహస్తి): పర్యావరణాన్ని పరిరక్షించడం ప్రతి ఒక్కరి బాధ్యత అని యువ సమాజ్ నిర్మాణ్ స్వచ్ఛంద సేవా సంస్థ ప్రతినిధులు అన్నారు. ఆదివారం శ్రీకాళహస్తి మండలం వాంపల్లి గ్రామం, జిల్లా పరిషత్ హై స్కూల్‌లో ఆ సంస్థ ప్రతినిధులు, వేము మెకానికల్ ఇంజినీరింగ్ విద్యార్థులు మొక్కలను నాటే కార్యక్రమం చేపట్టారు. జూన్ 5న ప్రపంచ పర్యావరణ దినోత్సవం రోజు నాటికి 2 వేల మొక్కలు నాటడమే లక్ష్యంగా పెట్టుకున్నామని సంస్థ ప్రతినిధులు తెలిపారు. కార్యక్రమంలో సంస్థ రాష్ట్ర అధ్యక్షుడు తాళిక్కాల్ వెంకటేశ్వర్లు, వ్యవస్థాపకుడు గానుగపెంట రమేష్, ప్రొఫెసర్ కేవీఎస్‌వీఎస్ రావు, నాని, సాయి కుమార్, మాధవ్, సాయి, తేజ సూర్య ప్రకాష్ పాల్గొన్నారు.

రాజీవ్ గాంధీకి నివాళి



నివాళులర్పిస్తున్న కాంగ్రెస్ నాయకులు

తొట్టంబేడు(శ్రీకాళహస్తి): దివంగత మాజీ ప్రధాని రాజీవ్‌గాంధీ వర్ధంతిని పట్టణంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఆదివారం నిర్వహించారు. ఆ పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి బత్తెయ్యనాయుడు ఆధ్వర్యంలో రాజీవ్ గాంధీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. జానీబాషా, శివకుమార్, వెంకటముని, శివయ్య, నాగూరయ్య, సురేష్, ప్రకాష్, వీరరాఘవరెడ్డి పాల్గొన్నారు.

కొవ్వొత్తుల ర్యాలీ



కొవ్వొత్తుల ర్యాలీలో స్టెప్స్ సంస్థ సభ్యులు

తొట్టంబేడు(శ్రీకాళహస్తి): శ్రీకాళహస్తి సంత మైదానం ఎస్సీ కాలనీలో స్టెప్స్ సంస్థ డైరెక్టర్ ప్రమీలమ్మ ఆధ్వర్యంలో అంతర్జాతీయ ఎయిడ్స్ స్మారక దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా కొవ్వొత్తుల ర్యాలీతో పాటు ఎయిడ్స్ వ్యాధితో మరణించిన వారికి దీపాలు వెలిగించి, వారి ఆత్మలకు శాంతి కలగాలని భగవంతున్ని ప్రార్థించారు. మృతుల కుటుంబ సభ్యులకు ఆయురారోగ్యాలతో పాటు మానసిక స్థైర్యం కలగాలని ఏటా మే నెల మూడో ఆదివారం ప్రపంచ వ్యాప్తంగా ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ప్రమీలమ్మ తెలిపారు. కార్యక్రమంలో ఏరియా హాస్పిటల్ కౌన్సిలర్ భారతి, సంస్థ సిబ్బంది రమేష్, గాయత్రి, సురేష్, దేవేంద్ర పాల్గొన్నారు.

పిల్లలకు క్రీడా పోటీలు



మ్యూజికల్ చైర్ ఆడుతున్న పిల్లలు

తొట్టంబేడు(శ్రీకాళహస్తి): యువనేస్తం అసోసియేషన్ వార్షికోత్సవ సందర్భంగా పిల్లలకు ఆదివారం క్రీడా పోటీలు నిర్వహించారు. శ్రీకాళహస్తి మండలంలోని ఊరందూరు, జింగేళపాళెం ఎస్టీకాలనీలోని పిల్లలకు కబడ్డీ, మ్యూజికల్ చైర్స్, లెమన్ స్పూన్ నిర్వహించినట్లు అసోసియేషన్ అధ్యక్షుడు మునిశేఖర్ తెలిపారు. కార్యక్రమంలో సంస్థ ప్రతినిధులు మునెమ్మ, హనుమంత్, అరుణ, నాగమణి పాల్గొన్నారు.

తిరుచ్చిపై శ్రీకృష్ణస్వామి విహారం



తిరుచ్చిపై ఊరేగుతున్న రుక్మిణి సత్యభామ సమేత శ్రీకృష్ణస్వామి

తిరుచానూరు(చంద్రగిరి) : తిరుచానూరు శ్రీ పద్మావతి అమ్మవారి ఆలయ అనుబంధ శ్రీకృష్ణస్వామి ఆలయంలో ఆదివారం ప్రత్యేక పూజలు చేశారు. సాయంత్రం స్వామి వారు తిరుచ్చి వాహనంపై భక్తులకు అభయం ఇచ్చారు. స్వామివారి జన్మనక్షత్రం రోహిణి సందర్భంగా ఉదయం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఇందులో భాగంగా తెల్లవారు జామున సుప్రభాత సేవతో మేల్కొపి నిత్యకైంకర్యాలు చేశారు. అభిషేక సేవ అనంతరం వజ్ర, వైఢూర్యాలు, మరకత మాణిక్యాలతో విశేషంగా అలంకరణ చేపట్టి భక్తులకు దర్శన భాగ్యం కల్పించారు. తదుపరి సాయంత్రం రుక్మిణి సత్యభామ సమేత శ్రీకృష్ణస్వామివారు తిరుచ్చి వాహనంపై ఆశీనులై నాలుగు మాఢ వీధుల్లో ఊరేగుతూ భక్తులకు దర్శనమిచ్చారు. కార్యక్రమంలో ఆలయ ఏఈఓ ప్రభాకర్‌రెడ్డి, ఏవీఎస్ఓ శైలేంద్రబాబు, సూపరింటెండెంట్ మధు, అధికారులు సుభాస్కర్‌నాయుడు తదితరులు పాల్గొన్నారు.

ముస్లింపాళెంలో మహిళపై దాడి



గాయపడిన పాజియా కుటుంబ సభ్యులు

వరదయ్యపాళెం: మండలంలోని ముస్లింపాళెంలో పాజియా తన ఇంటి వద్ద జేసీబీతో మట్టిని చదును చేయిస్తుండగా పక్కనే ఉన్న రసూల్ ఇంటి రేకులకు జేసీబీ తగలడంతో ఆదివారం సాయంత్రం వివాదం తలెత్తింది. ఇంటి రేకులు విరిగిపోవడంతో రసూల్ పాజియా అనే మహిళపై దురుసుగా ప్రవర్తించి దాడి చేశాడు. అడ్డుకోబోయిన పాజియా సమీప బంధువులు నౌఫల్, సిద్దిక్, జాఫర్‌లపై రసూల్, అతని భార్య జాహిదా, ఫిరోజ్, ఫజులూన్‌లు ముకుమ్మడిగా దాడి చేసి తీవ్రంగా గాయపరిచారు. ఈ విషయమై బాధితురాలు పాజియా వరదయ్యపాళెం పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. విచారణ చేసి కేసు నమోదు చేస్తామని ఎస్‌ఐ నాగార్జునరెడ్డి తెలిపారు.

అలరించిన అర్జున తపస్సు

శ్రీరంగరాజపురం: మండల పరిధిలోని తయ్యూరు పాయకట్టు, అంకనపల్లిలో ద్రౌపదీ సమేత ధర్మరాజుల వారి మహాభారత వార్షిక బ్రహ్మోత్సవాలు అట్టహాసంగా జరుగుతున్నాయి. ఆదివారం నిర్వహించిన అర్జున తపస్సు భక్తులను ఆకట్టుకుంది. వేకువజామున అర్చకులు స్వామివారిని సుప్రభాత సేవతో మేల్కొలిపి అర్చనలు, అభిషేకాలు చేపట్టారు. అనంతరం ద్రౌపదీదేవి ఉత్సవమూర్తితో పాటు శ్రీకృష్ణ, భీమ, అర్జున, నకుల, సహదేవుల ఉత్సవ విగ్రహాలను పురవీధుల్లో ఊరేగించారు.

ఫుట్‌బాల్ శిక్షణ శిబిరం ప్రారంభం



జీవాగ్రంలో ఫుట్‌బాల్ శిక్షణ శిబిరంలో యువత

రేణిగుంట: మండలంలోని జీవాగ్రం మైదానంలో ఆదివారం ఫుట్‌బాల్ శిక్షణ శిబిరం ప్రారంభమైంది. రిటైర్డ్ పీడీ సుధాకర్, పీసీసీ చైర్మన్ దివాకర్ ముఖ్య అతిథిగా శిబిరాన్ని ప్రారంభించారు. జీవాగ్రం ఫుట్‌బాల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జరిగే ఈ క్యాంప్‌ను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. క్యాంప్ నిర్వాహకులు యేసురత్నం, పాల్ భరత్‌భూషణ్, జగదీష్, నవీన్, స్వామిదాసు, సన్నీ తదితరులు పాల్గొన్నారు.

పశువుల కొనుగోలుకు రైతులకు రుణాలు

తిరుపతి అర్బన్: పాడి రైతులు పశువులను కొనుగోలు చేయడానికి రుణాలు మంజూరు చేయడానికి ప్రభుత్వ కసరత్తు చేస్తోందని జిల్లా పశువైద్యాధికారి రవికుమార్ ఆదివారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. డీఆర్‌డీఏ సెర్ప్ విభాగానికి చెందిన అధికారులు ఆ మేరకు చర్యలు ప్రారంభించారని పేర్కొన్నారు. అమూల్ పాల సేకరణలో భాగంగా జిల్లాలోని నారాయణవనం, వడమాలపేట, పుత్తూరు మండలాల్లో ఇప్పటికే 4 వేల లీటర్లకు పైగా పాల సేకరణ చేస్తున్న విషయాన్ని గుర్తుచేశారు. పాల ఉత్పత్తిని పెంచడానికి పాడి రైతులకు తొలి దశలో నారాయణవనం, వడమాలపేట, పుత్తూరు మండలాల్లో రుణాలు ఇవ్వనున్నట్లు తెలిపారు. తర్వాత జిల్లా వ్యాప్తంగా ఈ కార్యక్రమాన్ని విస్తరించనున్నారని తెలియజేశారు. పాడి రైతులు తమ పరిధిలోని సచివాలయంలో ఎప్పటికప్పుడు వివరాలు తెలుసుకుని ప్రయోజనం పొందాలని సూచించారు. ఎండ తీవ్రత ఎక్కువగా ఉన్న నేపథ్యంలో పశువులకు నీటి కొరత లేకుండా చూడాలని తెలిపారు.

కండలేరులో 32.551 టీఎంసీలు

రాపూరు: కండలేరు జలాశయంలో ఆదివారం నాటికి 32.551 టీఎంసీ నీరు నిల్వ ఉన్నట్లు జలాశయం ఈఈ విజయకుమార్‌రెడ్డి తెలిపారు. హెడ్ రెగ్యులేటర్ నుంచి సత్యసాయి గంగ కాలువకు 2,450 క్యూసెక్కులు, పిన్నేరువాగుకు 10, మొదటి బ్రాంచ్ కెనాల్‌కు 60, లోలెవల్ స్లూయీస్‌కు180, హైలెవల్ స్లూయీస్‌కు 15 క్యూసెక్కుల వంతున నీటిని విడుదల చేస్తున్నట్లు పేర్కొన్నారు.

జనరల్ నోటీసు

నా క్లయింట్ అయిన బెలగాల మేరీమంజుల D/o బెలగాల ఏసురత్నం అను ఆమె ఇందుమూలముగా యావన్మందికి తెలియజేయడం ఏమనగా వారి పిత్రార్జితమైన క్రింది షెడ్యూలు ఆస్తిని వారి అమ్మ, అక్క గార్లయిన బెలగాల చంద్రమ్మ మరియు అత్తిరాల సుహాసిని కలిసి వేరే వారికి పరాధీనము చేయ ప్రయత్నించుచున్నారు.సదరు ఆస్తి పై నా క్లయింటుకు కూడా సమాన హక్కు కలదు. కావున ఆమె అనుమతి లేకుండా ఎలాంటి క్రయవిక్రయ లావాదేవీలు జరుపరాదు. అట్లు జరిపినచో నా క్లయింటుకు బాధ్యతలేదు, ఒకవేళ ఏదైన క్రయ విక్రయములు జరిగిన వారిపై నా క్లయింటు తీసుకొను సివిల్ మరియు క్రిమినల్ చర్యలకు బాధ్యులగుదురని ఇందుమూలముగా తెలియజేయుచున్నాను.

షెడ్యూలు

తిరుపతి జిల్లా బాలాజీ రిజిస్ట్రేషన్ జిల్లా, శ్రీకాళహస్తి సబ్ డిస్ట్రిక్ శ్రీ కాళహస్తి టౌన్ పానగల్ లోని హౌసింగ్ బోర్డు కాలనీలో వుండు Plot No.LIG 36 Door No.17/373 ఇందులోగల ఇల్లు భాళీ జాగాకు Municipal Assessment No.1011006515 కు హద్దులు **తూర్పు:** కాలనీ రోడ్డు, **పడమర:** రామమూర్తి ఇల్లు, **ఉత్తరం:** ఎం.ప్రసాదు ఇల్లు, **దక్షిణం:** కాలనీ రోడ్డు, కొలతలు తూర్పు–పడమర: 40 Feet, ఉత్తర–దక్షిణం: 30 అడుగుల వెడల్పు మొత్తం: 133.33 Sq.yards.

ARAMBAKAM MUNI PRASAD, B.A., B.L.,
Advocate
#6-168, Babu Agraharam, Srikalahasti, ✆ 9502020107.